ఆఫ్‌లైన్‌లో కూడా ఓపీ చీటీలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: ప్రభుత్వాసుపత్రుల్లో ఓపీ చీటీల పంపిణీ కోసం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం రోగుల సహనాన్ని పరీక్షిస్తోందని, వెంటనే ఆ విధానానికి స్వస్తి పలికి పాత విధానాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ టికెట్ల జారీని ఆభా యాప్ ద్వారా చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో కింగ్ జార్జి ఆసుపత్రి ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులను త్వరగా కలిసి, చికిత్స పొందాలని ఎదురుచూసే రోగులకు ఆన్‌లైన్ కష్టాలు తప్పడం లేదని అన్నారు. అందులోనూ నిరక్షరాస్యులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారని తెలిపారు. ఆభా (ఆయుష్మాన్ భారత్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి, ఓపీ చీటీలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు విఘాతం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ విధానంలో ఓపీ చీటీలు ఇస్తూ, సమాంతరంగా ఆన్‌లైన్ ద్వారా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఓపీ కౌంటర్‌కి వెళ్తే రోగి వివరాలు నమోదు చేసుకుని, చీటీ ఇచ్చేవారని.. ఆదే విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేజీహెచ్ ఇన్‌చార్జి పర్యవేక్షణ వైద్యాధికారి రాధకృష్ణ, ఏడీ శ్రీనివాస్ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆన్‌లైన్ తో పాటు ఆఫ్‌లైన్ ఓపీలు కూడా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తూ కౌంటర్ల ద్వారా కూడా ఓపీ టికెట్స్ ఇచ్చే పద్ధతి కొనసాగిస్తామని తెలిపారు. ప్రజల్లో ఉన్న ఆందోళనలు తొలగించడానికి దీనిపై పత్రికలు, ప్రసార మాధ్యమాలు ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్‌కె రెహమాన్, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, వి.చంద్రశేఖర్, సిఎన్ క్షేత్రపాల్, జిఎస్‌జె అత్యుతరావు తదితరులతో పాటు పలువురు పార్టీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - జి.మాడుగుల: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీఓ చంద్రశేఖరరావు, సీడీపీఓ సువర్ణమ్మ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మహ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వలన గర్భంలోని పిండం సకాలంలో, సరైన బరువు పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడం వలన గర్భిణికి సుఖ ప్రసవం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రసవం జరిగిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు త్రాగించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాంబాబు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీ విజయ కుమారి, పీఆర్ జేఈ మాణిక్యం, సూపర్వైజర్లు కొండమ్మ, సత్య సుజాత, విజయ కుమారి, లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు వెంకట్ లక్ష్మి, చంద్రమణి, సింహాచలం, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకు వార్డు అభివృద్ధి

విశాలాంధ్ర - మల్కాపురం: ప్రజల అభీష్టం, అవసరాలమేరకు అభివృద్ధి పనులు చేపట్టి విశేష అభివృద్ధికి కేంద్రంగా తమ వార్డును మార్చాలన్నదే తన లక్ష్యమని 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పివి సురేష్ అన్నారు. గురువారం వార్డు ఎంఐజి కాలనీలో నిర్మించతలపెట్టిన సామాజిక భవనానికి ఆయన చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. సుమారుగా 20 లక్షల రూపాయల ఎంపీ నిధులు, 47 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులను కలగలిపి విశాలమైన సామాజిక భవన నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐజి అసోసియేషన్ సభ్యులు, ఇంజనీరింగ్ విభాగం అధికా రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరో 44 మందికి అక్రిడేషన్లు

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో కొత్తగా 44 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడేషన్ మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. ఇంతకు ముందు 234 మంది విలేకరులతో కలిపి మొత్తం 278 మంది ప్రింట్ టీవీ జర్నలిస్టులకు అక్రిడేషన్ మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో కన్వీనర్ డీఐపీఆర్‌ఓ కె.ఇంద్రావతి, కమిటీ సభ్యులు కె.చంద్రరావు, టి.రమేష్, వి.లోవరాజు, కె.చంద్ర శేఖర్, షేక్ చాంద్ బాషా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ బి.భాను మూర్తి, డీపీఆర్‌ఓ డి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - అనంతగిరి: వర్షాకాలంలో పశువులకు సోకే పశువ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కాశీపట్నం పశువైద్యాధికారి సాగరి గనేశ్వరారావు అన్నారు. పినకోట పంచాయతీ వాజంగి గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల బారిన పడిన 56 పశువులకు చికిత్స చేసి లంపి చర్మవ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు తెలిపారు. పశువులు అనారోగ్యానికి గురైతే తక్షణమే సచివాలయ పశుసంవర్ధక సహాయకులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చి పాదయాత్ర ఆసాంతం సీపీఎస్ ఉద్యోగులను వెనుక తిప్పుకొని, ఇప్పుడు 4 సంవత్సరాలు గడిచిన తరువాత ఒక గందరగోళ పెన్షన్ (జిపిఎస్)ను తీసుకొచ్చి దాచుకున్న డబ్బులు మొత్తం కాజెయ్యడానికి ప్రయత్నం చేస్తున్న ఈ ప్రభుత్వ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా గురువారం విశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కోరుకొండ సతీష్ అధ్వర్యంలో డివిజన్ స్థాయిలో ఉన్న ఉద్యోగులు అనకాపల్లి 4 రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. తదుపరి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రొంగల అప్పలరాజు, జిల్లా నాయకులు మోటూరి త్రినాథ స్వామి, చిన్నారావు, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర - పెదబయలు: పెదబయలు మండల కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాలు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్.పూర్ణయ్య హాజరై మాట్లాడారు. పోషకాహారం యొక్క విలువలు, వాటి సమతుల్య ఆహారం తీసుకునే జాగ్రత్తలు, గర్భిణీలు, బాలింతలు తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు బోండా వరహాలమ్మ, వైస్ ఎంపీపీ కొర్ర రాజబాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, సచివాలయ మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదబయలు స్పందన రద్దు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: పెదబయలు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనను రద్దు చేసామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా శుక్రవారం ఐటీడీఏలో స్పందనను రద్దు చేసిన విషయం కూడా గుర్తు చేశారు. జాతీయ షెడ్యూలు తెగల కమిషన్ సభ్యులు అనంత నాయక్ పర్యటన ఉన్నందున స్పందన కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఆదివాసేతరులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెదబయలు: గిరిజన చట్టాలు, హక్కులను ఉల్లంఘించి దౌర్జన్యంగా అక్రమ కట్టడాలకు పూనుకుంటున్న ఆదివాసేతరులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. 29 సెంట్లు భూమిని దర్జాగా ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు కడుతున్న ఆదివాసేతరుడు పీల కృష్ణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. పాడేరు మండలం, చింతల వీధి పంచాయతీ కొత్త కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన కూడ చిట్టిబాబు, చిన్నాలమ్మకు చెందిన 29 సెంట్లు భూమి కొద్ది రోజులకు పశువుల గడ్డి పెట్టుకోవడానికి స్థలం ఇస్తే అదే అదునుగా భావించిన ఆదివాసేతరుడు పీల కృష్ణ 29 సెంట్లు భూమి ఆక్రమించి దర్జాగా ఇల్లులు, షెడ్లు కట్టుకుంటున్నారని అన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తక్షణమే ఆదివాసేతరుడు కృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గురజాడ జయంతి

విశాలాంధ్ర - పరవాడ: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, గర్ల్స్ హైస్కూల్లో గురువారం గురజాడ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కళాశాల ప్రిన్సిపల్ నారాయణరావు, తెలుగు పండితులు లక్ష్మీకాంతం, గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల, ఐద్వా నాయకురాలు మాణిక్యం తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తన రచనల ద్వారా జాతిని జాగృతం చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.రోషిణి, పి.పూజిత, కె.పుష్ప, పి.శాంతి, కె.బిందు, ఎస్.బేబి తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో పెదబోదుగల్లం హైస్కూలలో గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ మేరకు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ గ్రాంధిక బాషను నరసించి వ్యవహరిక బాష కోసం ఉద్యమం నడిపిన వారిలో అగ్రగణ్యులు గురజాడ అని, తెలు సాహిత్యంలో ఆయన చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎవిఎల్ఎన్ కుమారి, చిన్నారావు, రమేష్‌బాబు, శ్రీదేవి తదిరులు పాల్గొన్నారు.

యస్.రాయవరం: మహాకవి గురజాడ వెంకట అప్పారావు జన్మస్థలమైన ఎస్ రాయవరంలో గురజాడ 162వ జయంతి ఘనంగా నిర్వహించారు. గురజాడ విగ్రహానికి జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి చేతుల మీదగా పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గురజాడ సమాజం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపతి అప్పారావు, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు కర్రీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి కందుల వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు కర్రీ పెద్దబ్బాయి, కుర్రా కాశి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్.రాయవరంలో వినయ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో గురజాడ జయంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు పలు గురజాడ రచనలు విషయాలను తెలియజేశారు.

మెకానికల్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - ఆనందపురం: మెకానికల్ కోర్సులతోనే డిప్లమా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాకారం అవుతుందని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అన్నారు. ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నిక్‌లో మెకానికల్ విభాగం వారు రెండు రోజులపాటు నిర్వహించిన కన్వెన్షనల్ మెషినింగ్ ప్రాసెస్ అనే వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భావి తరాల భవిష్యత్తు మెకానికల్ రంగం మీద ఆధారపడి ఉంటు ందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, డిప్లమో ప్రిన్సిపాల్ ఎల్.మహేశ్వర రావు, ఇంజనీరింగ్ డాక్టర్ ప్రిన్సిపాల్ ప్రదీప్ వర్మ, అక డమిక్ ఇన్‌చార్జ్ కెవిఎస్ అమరేంద్ర కుమార్, మెకానికల్ హెచ్ఓడీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రోత్సాహంలో ముందు వరుసలో ఉక్కు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: క్రీడా సంస్కృతి ప్రోత్సాహంలో విశాఖ ఉక్కు యాజమాన్యం ముందు వరసలో ఉంటుందని ఉక్కు సీఎండీ అతుల్ బట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్, నేషనల్, స్టేట్ లెవెల్‌లో సిల్వర్, గోల్డ్ మెడల్ సాధించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అతి పెద్దదిగా విస్తరించి ఉండటం సంతోషదాయకమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి క్రీడల్లో పాల్గొని జాతీయ అంతర్జాతీయ మెడల్స్‌ను సాధించి విశాఖ స్టీల్‌ప్లాంట్ పేరును ప్రపంచానికి చాటి చెబుతున్న కార్మికులను, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పర్సనల్ డాక్టర్ పాండే, సిజిఎం హెచ్ఆర్ జి.గాంధీ, సిజిఎం మెడికల్ ప్రకాష్, జనరల్ మేనేజర్ జి.అప్పారావు , జనరల్ మేనేజర్ ఎమ్మెస్ ఎం.మధుసూదన్‌రావు, జనరల్ మేనేజర్ బంద్ వై.చంద్రశేఖర్, కార్మిక సంఘాల నాయకులు ఆదినారాయణ, రామస్వామి, కారు రమణ, కేఎస్ఎన్ రావు, సన్యాసిరావు, మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

మావోల వారోత్సవాల నేపథ్యంలో గట్టి నిఘా

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మావోయిస్టు పార్టీ ఈనెల 27వ తేదీ వరకు వారోత్సవాల నేపథ్యంలో మండలంలో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై కే.రవీంద్ర అన్నారు. గురువారం మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో జోలాపుట్టు పంచాయతీ పోలిపుట్ జంక్షన్ వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రవీంద్ర మాట్లాడుతూ మావోయిస్టు పిలుపునిచ్చిన వార్షిక వారోత్సవాల సందర్భంగా పోలిపుట్ జంక్షన్ వద్ద జోలాపుట్ డుడుమ, ఒడిస్సా రేపు వెళ్లే వాహనాలను తనిఖీలు నిర్వహించమని ఆయన అన్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ సతీష్, హెూంగార్డులు అర్జున్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణాలకు బ్యాంకులు రుణాలు అందించాలి

కలెక్టర్ డా. మల్లికార్జున

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, బ్యాంకు రుణాలు వచ్చేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం వీఎమ్మార్డీఏ కార్యాలయం నుండి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న లేఅవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటికి బ్యాంక్ అకౌంట్‌లు ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలన్నారు.

ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల స్టేజి అప్డేషన్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంట్‌లను లేఅవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, వీఎమ్మార్డీఏ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో ప్రభుత్వం నూతనగా నిర్మిస్తున్న, నిర్మాణ దశలో ఉన్న భవన నిర్మాణాల్లో పటిష్టమైన నాణ్యత పాటించాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని లబ్బూరులో నిర్మిస్తున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు నిర్మాణ పనులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ డిసెంబరు నెలాఖరునాటికి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రావిడిపుట్టు గ్రామస్తులు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని స్పందనలో ఫిర్యాదు చేసారు. గ్రామస్తుల అభ్యర్ధన మేరకు రావిడి పుట్టు గ్రామాన్ని సందర్శించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బంగారుమెట్ట గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్, ఏఈఈ జబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విమర్శించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలోని సత్యవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, మల్లపురెడ్డి రమాకుమారి, బొంది కాశీవిశ్వనాద్, పల్లా విలియంకేరి, పెదిరెడ్డి శ్రీరాములు, చిక్కాల శ్రీను, చింతలవు ప్రదీప్, వంకా శివ, వేములపూడి అప్పారావు, రాజాన ఆది, ఏడిద సురేష్, ఏనుగు నరసింహమూర్తి, చిరుకూరి పేర్రాజు, బోడపాటి శ్రీను, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర, బహిరంగ సభ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఈనెల 26వ తేదీన పాయకరావుపేటలో జరిగే విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. బహిరంగ సభకు సంబంధించి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో విశాఖ స్టీల్‌ప్లాంట్ కీలకపాత్ర పోషించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే దళితులు, గిరిజనులు, బిసిలు ఉపాధి కోల్పోతారని తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాంట్ నడిస్తే మరో 25వేల మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ప్రైవేటు పరం చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు వంతపాడుతున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో బత్తిన నాగేశ్వరరావు, రాము, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి



విశాలాంధ్ర - అనంతగిరి: నూతనంగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రేగ బోయిన స్వామి మండలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అందరి సలహాలు, సంప్రదింపులు తో పార్టీని బలోపేతం చేయడానికి సాయ శక్తుల కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు రెగబోయిన స్వామి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనను నమ్మి గతంలో జిల్లా పరిషత్ మెంబర్‌గా బీఫార్మచ్చారని గ్రూపుల రాజకీయం కారణంగా అప్పుడు స్వల్ప ఓట్లతో ఓటమిపాలయ్యానన్నారు. మరలా అధిష్టానం తమ సేవలను గుర్తించి అరకులోయ శాసనసభ్యుల ఆశీస్సులతో మండల పార్టీ అధ్యక్షులుగా నియమించారన్నారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆశయాలకు అనుకూలంగా పనిచేసి రాబోయే సార్వత్రిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా మండలంలో పనిచేస్తామని ముక్తకంఠంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కుర్ర సూర్యనారాయణ, గుమ్మకోట ఎంపీటీసీ తవిటి నాయుడు, ప్రధాన కార్యదర్శి డానియల్, తిరుపతిరావు, గంగులు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

23న సీపీఐ మండల సమితి సమావేశం

విశాలాంధ్ర - కొయ్యూరు : సీపీఐ మండల సమితి సమావేశాన్ని ఈనెల 23న నిర్వహించనున్నట్లు పార్టీ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, మండల నేత నానాజీ తెలిపారు. మండలంలోని కించలి గ్రామంలో నిర్వహించనున్న సమితి సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, పార్టీ అల్లూరు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ హాజరుకానున్నారన్నారు.

సైబర్ సెక్యూరిటీపై పోర్టు ఉద్యోగులకు గీతం వర్క్‌షాప్

విశాలాంధ్ర - మధురవాడ: విశాఖ పోర్టు ఉద్యోగులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గురువారం సైబర్ సెక్యూరిటీపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. విశాఖ పోర్టు ఛీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ టి.విజయశేఖర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష హాజరయ్యారు. రెండు రోజులు పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఆన్‌లైన్ భద్రత, సంస్థకు సంబంధించిన విలువైన సమాచారం, అలాగే వ్యక్తిగత సమాచారం భద్రతలో పాటించాల్సిన మెలకువలను తెలియజేసారు. కార్యక్రమంలో గీతం ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ జి.లక్ష్మీశ్వరి, కె.సందీప్ వర్మ, ఎ.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారు నాలుగు నెలల తరువాత స్వర్ణ నారసింహ కవచ అవతారంలో దర్శనమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అధికార బాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు దంపతులు దర్శించు కున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, పర్యవేక్షకులు త్రిమూర్తులు పూలమాల ఇచ్చి ఘనస్వాగతం పలికారు. తొలుత వీరు కప్ప స్థంభం ఆలింగనం చేసుకుని తమ గోత్ర నామాలతో స్వామివారికి సంకల్పం చేయించారు. ఏఈఓ, సూపరింటెండెంట్‌లు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని జమ్మా దులపాలెం గ్రామంలో గురువారం ఘనంగా పౌష్టి కాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీఓ ప్రభావతి మాట్లాడుతూ చిరుధాన్యాలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం కాపాడు కోవచ్చునన్నారు. అంగన్‌వాడీలో పంపిణీ చేయ బడుతున్న పౌష్టికాహార కిట్ తినడం వల్ల మంచి ఆరోగ్యం, రక్తహీనత నుండి బయటపడొచ్చని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వంశీప్రియ, సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, ఎంపీటీసీ గూడుపు లక్ష్మీరాజు, మహిళా పోలీస్ సంతోషి, ఏఎన్ఎం చంద్రమ్మ, అంగన్వాడీ సిబ్బంది గంగవేణి, సూర్య కుమారి, రజిని, పార్వతి, రమణమ్మ, సుబ్బలక్ష్మి, పద్మ, నాగవరలక్ష్మి రమణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్మూలన చర్యలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: పోతంగి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల దుంబ్రిగుడ కేంద్రం లోని పేరుకుపోయిన చెత్తా చెదారాల తొలగింపు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి విజయ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చెత్తను తొల గించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న అపారిశుధ్యాన్ని తొలగించడమే కాకుండా గ్రామాల్లోని వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను కూడా తొలగించినట్టు కార్యదర్శి తెలిపారు. అలాగే స్థానిక కిరాణా షాపుల యజమానులు వారి వారి షాపుల ఎదురుగా చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ శెట్టి జగ్గు నాయుడు (జగన్), మండల వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు పాల్గొన్నారు.

చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలంటూ గురువారం మాడుగులలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిజి.కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావుతో కలిసి రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్, ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి సీఎం జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి అప్పలనాయుడు, రొంగలి మహేష్, కసిరెడ్డి గణపతి, చల్లా నానాజీ, చింతా సాంబ మూర్తి, అద్దేపల్లి జగ్గారావు, నందారపు సన్యాసిరావు, పద్దాది రంజిత్‌వర్మ, లెక్కల కాశిబాబు, మరువాడ ఈశ్వరరావు, పుప్పాల రమేష్ పాల్గొన్నారు.

జోగంపేటలో జల్ జీవన్ మిషన్ బృందం పర్యటన

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో గల జోగంపేటలో కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన జలజీవన్ మిషన్ నిధులు ఏ విధంగా అమలయ్యాయో పర్యవేక్షించేందుకు కేంద్ర బృందం గ్రామంలో పర్యటించింది. వారికి మండల వైస్ ఎంపీపీ జక్కు నాగమణి స్వాగతం పలికారు. అనంతరం ఈ బృందంలో సుశీల్ కుమార్ చూబే, ఈశ్వర్ చంద్ జైన్ ఇంటింటికి వెళ్లి నీటి వినియోగం, మరుగుదొడ్డి నిర్వహణపై పూర్తి వివరాలు సేకరించారు. కేంద్ర బృంద సభ్యులను వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ లక్ష్మి ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచినీటి సరఫరా విభాగం అధికారులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితోనే ప్రతిపక్షాలకు సమాధానం

వైసీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రతిపక్షాల మాటలను పట్టించుకోకుండా అనకాపల్లి నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధితోనే సమాధానం చెప్పడానికి మంత్రి గుడివాడ అమర్నాథ్ కృషి చేస్తున్నారని వైసీపీ అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు పేర్కొన్నారు. అనకాపల్లి రింగ్ రోడ్‌లో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి పట్టణంలో సుమారు ఇరవై కోట్ల రూపా యలతో రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని వివరించారు. రహదారులతో పాటు సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరీకరించడానికి ఆయన కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఫుట్ పాత్‌పై పాదచారులు నడవడానికి వీలుగా పలకలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనకాపల్లిలో శారదా నది ఒడ్డున, గవరపాలెంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలను సుమారు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి చేపట్టడానికి మంత్రి కృషి చేస్తున్నారన్నారు. అనకాపల్లిలో ఉన్న జిల్లా ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా మరో 50 పడకలు పెంచడానికి చర్యలు చేపట్టారన్నారు. లారస్ సంస్థ ఆర్థిక సాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిలో శరీర భాగాలు కాలిన వారికోసం ప్రత్యేకంగా ఓ ప్రత్యేక బర్నింగ్ వార్డును ఏర్పాటు చేస్తున్న రన్నారు. పరిశ్రమల శాఖ మంత్రిగా సమీపంలో ఉన్న పలు పరిశ్రమల నుండి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి కల్యాణ మండపాలు నిర్మించడానికి చర్యలు చేపట్టారన్నారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ గారు, తిరుపతి తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి కృషితో రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి దేవస్థానం విడుదల చేసిన పది కోట్ల రూపాయలతో చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులు జరుగుతున్నా యన్నారు. కొత్తూరులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కళ్యాణ మండపాన్ని నిర్మించడానికి మంత్రి కృషి చేస్తున్నారని ఆయన వివరించారు. అలాగే కొత్తూరులో ఉద్యానవనం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనకాపల్లిలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా శాంతియుతమైన వాతావరణం కల్పించిన ఘనత మంత్రి గుడివాడ అమర్నాథ్‌కే దక్కుతుందన్నారు. దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామి దేవాలయం, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవాలయం, సిద్ధి లింగేశ్వర దేవాలయం, కాశీ విశ్వేశ్వర ఆలయాల పాలకవర్గ నియామక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ నూకాంబికా దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, జిల్లా పార్టీ కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, భోగలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వర రావు, సకలా గోవిందరావు, నుదురుపాటి తాతాజీ, అనుపర్తి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పీవీ రత్నకుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండా రమేష్ గుప్తా, పార్టీ నాయకులు పీరువాకల నారాయణ రావు, కారుకుండి కన్నబాబు, బేతి ఈశ్వరరావు, నాగులపల్లి వీరాజు, మచ్చిన పైడిరాజు, సుంకర వెంకటేశ్వరరావు, సిహెచ్ వాసు, సూరిశెట్టి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పై, కానిస్టేబుల్, జియో గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెదబయలు: లక్ష్మీపేట పంచాయితీ మొండికోట గ్రామానికి చెందిన కింజె విజయ కుమార్‌పై దాడి చేసిన ఎస్సై మనోజ్ కుమార్, కానిస్టేబుల్, జియో గుత్తేదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు బొండ సన్నిబాబు డిమాండ్ చేశారు. గురువారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ప్రైవేట్ జియో గుత్తేదారులకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉన్నత స్థాయి అధికారులు అందరూ సాయ సహకారాలతో సెల్ టవర్లు నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. అందులో భాగంగానే గిరిజన ప్రాంతంలో అన్నిచోట్ల ముమ్మరంగా జియో టవర్లు నిర్మాణాలు చేపడుతున్నారని జియో టవర్ నిర్మాణాలు చేపడితే గిరిజనులకు ఒరిగేది ఏమీ లేదని, గిరిజన ప్రజానీకానికి ప్రయోజనం లేదని అన్నారు. అందులో భాగంగానే మండలంలో లక్ష్మీపేట పంచాయితీ, మొండికోట గ్రామంలో సరిహద్దులో జియో టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వనందుకు కింజె విజయ కుమార్‌పై స్థానిక ఎస్సై, కానిస్టేబుల్, జియో టవర్ గుత్తేదారులు కలిసి కింజాయి వినోద్ కుమార్‌పై దాడికి పూనుకున్నారని అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కి, అల్లూరి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్సైని వెనకేసుకు వస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఉన్నత స్థాయి అధికారులు గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీపీ నాయకులు మర్రిచెట్టు పోతురాజు, చెంద లోవరాజు, గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొండా గంగాధరం, కేనర్సన్న, లక్ష్మీపేట మాజీ వైస్ సర్పంచ్ ఎం.అప్పలనాయుడు, ఏబీవీపీ నాయకులు అల్లంగి మహేష్, ఏ.ఆనంద్, టిడిపి నాయకులు బత్తిరి రామారావు, మహేష్, వార్డ్ మెంబర్ జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారి ఆలయానికి 100 కేజీల బియ్యం వితరణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు సర్పంచ్ గొల్లపల్లి సంజీవరావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి ప్రభావతి దంపతులు విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం గురువారం దేవస్థానం ఎండోమెంట్ అధికారులకు 100 కేజీలు బియ్యం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి అగ్రహారం పిఎసిఎస్ అధ్యక్షులు కోరుకొండ చిన్నంనాయుడు, గోకాడ లక్ష్మీరావు, పోతిన జగదీష్ దంపతులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - చీడికాడ: విశ్వబ్రాహ్మణులకు ప్రధానమంత్రి మోదీ జన్మదినం రోజు విడుదల చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నడుపూరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని సభ్యులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి నడిపూరి సత్తిబాబు విచ్చేశారు. నాగరాజు ఈ పథకం యొక్క నిబంధనలు నమోదు చేసుకునే విధానం సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి నడిపూరి ముత్యాలు, ఉపాధ్యక్షులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవంలో కంచిపాటి

విశాలాంధ్ర - పెందుర్తి: మండలంలోని గొరపల్లి గ్రామదేవత దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వైసీపీ సీనియర్ నాయకులు కంచిపాటి విశ్వనాథ నాయుడు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని కంచిపాటి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కంచిపాటి విశ్వనాథ నాయుడును ఘనంగా సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేసారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, వైసీపీ సీనియర్ నాయకులు జామి గంగు నాయుడు, మాజీ సర్పంచ్ ముకుందరావు, గండి భూషణరావు పాల్గొన్నారు.

23న మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - హుకుంపేట: ఈ నెల 23వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 73వ జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బీజేవైఎం (భారతీయ జనతా యువ మోర్చా) పార్లమెంట్ ఆధ్వర్యంలో మెగా రక్త దాన శిబిరం నిర్వహిస్తున్నామని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గెమ్మెలి కొండబాబు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షులు వంతల గాసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయసు పైబడిన వారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండ బాబు, బీజేపీ జిల్లా కోశాధికారి కొర్ర ఆనంద్, బీజేవైఎం మండల అధ్యక్షులు సిదరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మారేడుమిల్లి ఐసిడిఎస్ పిఓ ఎస్.ప్రసన్న విశ్వనాధ్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మహోత్సవాలు సందర్భంగా స్థానిక అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార సీమంత వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఓ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అంగన్వాడీ ద్వారా అందించే ఈ పౌష్టిక ఆహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, మారేడుమిల్లి సర్పంచ్ కొండా జాకబ్, ఐసిడిఎస్ సిబ్బంది, సూపర్వైజర్‌లు కే సత్యనారాయణమ్మ, సిహెచ్ చిన్న సీత, కె.రవళి, జి ఆనంద్, అంగన్వాడీ వర్కర్స్ ఎస్.ప్రశాంతి, కే.స్వరూప, సిహెచ్ చిరంజీవి, వి హైమావతి, కే మంగ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 'హెల్త్‌వాచ్ టెలిడయాగ్నోస్టిక్స్' కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అంతర్జాతీయ ఆరోగ్య సంరక్షణ అవుట్‌సోర్సింగ్‌ను అందించే మార్గదర్శక సంస్థ, కార్డియాక్ రిథమ్ మానిటరింగ్‌లో ప్రత్యేకత కలిగి ఉన్న 'హెల్త్‌వాచ్ టెలిడయాగ్నోస్టిక్స్' హైదరాబాద్‌లో కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సంస్థ ఇంటి వద్దనే హోల్టర్, ఏబీపీఎం టెస్టులు చేయనుంది. ఈ సందర్భంగా హెల్త్‌వాచ్ టెలిడయాగ్నోస్టిక్స్ ఎండీ డాక్టర్ ఎస్ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యాలయం ప్రారంభంతో హైదరాబాద్ నగరంలో సేవలను అందుబాటులో ఉంచామని తెలిపారు. హైదరాబాద్, పొరుగు ప్రాంతాలలో నివసిస్తున్న రోగులకు కంపెనీ తన ప్రీమియర్ ఎక్స్‌టెండెడ్ హోల్టర్, ఏబీపీఎం పరీక్ష సేవలను విస్తరిస్తుందన్నారు. ఈ కొత్త కార్యాలయం రోగనిర్ధారణ పరికరాలకు అనుకూలమైన యాక్సెస్‌ను నిర్ధారిస్తుందన్నారు.

ట్రూకాలర్ మోసాల నివారణకు ఏఐ గుర్తింపు ఫీచర్స్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ట్రూ కాలర్‌లోని సాంకేతిక మోసాలు అరికట్టేందుకు ట్రూకాలర్ గూగుల్ ప్లే స్టోర్ ఆపిల్ యాప్ స్టోర్‌పై తక్షణం గుర్తించేలే ఒక కార్పొరేట్ రీబ్రాండింగ్, ఒక కొత్త యాప్ ఐకాన్ ప్రారంభాన్ని ప్రకటించింది. ట్రూకాలర్ పునరు ద్ధరించబడిన ఉద్దేశము, శక్తి ఉత్సాహం ఈ రీబ్రాండింగ్ యొక్క ముఖ్యాంశాలు అని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ట్రూకాలర్ సహ వ్యవస్థాపకులు అలాన్ మామెడి తెలిపారు. రిఫ్రెష్ చేయబడిన గుర్తింపులో ఒక భాగముగా, ట్రూకాలర్ ఏఐ ఐడెంటిటీ ఇంజిన్‌లో భాగంగా ట్రూకాలర్ యూజర్లు సెర్చ్ కాంటెక్స్ట్ అనే ఒక శక్తివంతమైన మోసం-వ్యతిరేకమైన ఫీచర్‌ను పొందుతారని చెప్పారు.

22న అవంతి కళాశాలలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - మాకవరపాలెం: స్థానిక అవంతి కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి, శిక్షణ శాఖ (ఏపిఎస్‌ఎస్‌డిసి) అవంతి కళాశాల సంయుక్తంగా మెగా జాబ్ మేళాను ఈ నెల 22 నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఏపిఎస్ఎస్‌డిసి కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్(ఐఎస్ఏ) గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ పదో తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువతి యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు గూగుల్ ఫారం లింక్ https:forms.gle\G1ycrTrpzw2gevwsa ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9705474968ను సంప్రదించాలని కోరారు.

వైద్యులు అందుబాటులో ఉండాల్సిందే

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూర్య తేజ, అడిషనల్ డిఎం హెచ్‌ఓ జి.ప్రకాశం గురువారం రాజవొమ్మంగి, జడ్డంగి పీహెచ్‌సీలను ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, అత్యవసర కేసులకు తగిన వైద్యం అందించి అనంతరం రిఫర్ చేయాలని అన్నారు. ఈ నెల 30వ తేదీ నుండి జగనన్న సురక్ష ప్రారంభిస్తామని, వైద్యులు సిబ్బంది ఇంటింటికి తిరిగి పరీక్షలు నిర్వహించి ఆయా ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారన్నారు. ఈయన వెంట రాజవొమ్మంగి, లాగరాయి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మోటరోలా ఎడ్జ్ 40 నియో విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ఉత్తమ 5జి స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ అయిన మోటరోలా, ఇటీవల ఎడ్జ్ సిరీస్‌లో తన తాజా ఆఫరింగ్ మోటోరోలా ఎడ్జ్ 40 నియోను ప్రకటించింది. ఈ పరికరము స్టేట్-ఆఫ్-ది-ఆర్ట్ సాంకేతికతను అభివృద్ధి చేయుటకు మరియు యూజర్స్‌కు మార్కెట్ ఫీచర్స్‌తో కస్ట్-ప్రభావిత ధరలలో ఎడ్జ్ కుటుంబపు విషన్ ను కలిగి ఉంటుంది. ఆధునికతలో ముందు ఉన్న, మోటోరోలా ఎడ్జ్ 40 నియో అందమైన, సన్నని ఎండ్‌లెస్ ఎడ్జ్ డిజైన్‌లో పాంటోన్ క్యురేటెడ్ ట్రెండ్-సెట్టింగ్ రంగులలో ప్రవేశపెట్టబడింది. బ్లాక్ బ్యూటీ, సూథింగ్ సీ, కనీల్ బే వంటి శక్తివంతమైన రంగుల ద్వారా వ్యక్తిగత శైలిని ప్రోత్సహిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు.

12 కిలోల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - చీడికాడ: అక్రమంగా తరలిస్తున్న 12 కేజీల గంజాయితో పాటు ఏఎస్ఆర్ జిల్లా చింతపల్లి మండలానికి చెందిన కొర్ర దాసూరావును అరెస్టు చేశామని ఎస్సై పి రామారావు తెలిపారు. మండలంలోని అప్పలరాజుపురం గ్రామ శివారులో ముందుగా సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా కోణం నుండి అప్పలరాజుపురం వచ్చే దారిలో అటుగా పల్సర్ బైక్‌పై ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి బైక్ వెనక్కి తిప్పి స్పీడ్‌గా పారిపోతుండగా వెనక కూర్చున్న వ్యక్తి బ్యాగు క్రింద పడిపోయిందన్నారు. ఆ బ్యాగ్‌ని సోదా చేయగా అందులో ఉన్న 12 కేజీలు గంజాయిని, సెల్‌ఫోన్, బైక్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. బైక్ నడుపుతున్న వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రిలే నిరాహార దీక్షకు సుందరపు సంఘీభావం

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ దీక్ష శిబిరానికి విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకున్నారని వైసీపీ పార్టీకి 151 స్థానాలతో గెలిపించారని రాష్ట్రంలో ఆరాచకం తప్ప అభివృద్ధి లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రోడ్లు పరిస్థితి అయోమయంగా తయారైందని పట్టించుకోడే నాథుడే లేదని అన్నారు. నిరుద్యోగులకు నూతన కంపెనీలు రాకపోవడం వల్ల రోడ్డున పడ్డారని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేశారని ఎఫ్.ఐ.ఆర్‌లో కనీసం పేరు కూడా లేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమితో ప్రభుత్వం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, మాజీ సర్పంచ్ కాండ్రేగుల ప్రకాష్, కార్యదర్శి కె.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్, వీర మహిళ సరోజినీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాడి ముసలి నాయుడు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బీమరశెట్టి శ్రీనివాసరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, విల్లూరి నూక నరసింహారావు, కాండ్రేగుల పరదేశి నాయుడు, కోరుకొండ ప్రసాద్, పెంటకోట శ్రీరామ్ మూర్తి,వెలగా మురళి, కాండ్రేగుల శంకర్,ఆదారి జానకి, మాటూరి, మండల జనసైనికులు, తెలుగుదేశం అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్స్ యూనిట్లపై నిర్ణయం ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ యూనిట్స్ నెలకొల్పడానికి రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించు కోవాలని, మండలంలో రాజయ్యపేట గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలియ జేసారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేక రులతో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గం నక్కపల్లిలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటు కొరకు సేకరించిన భూములలో బల్క్ డ్రగ్స్ యూనిట్లు నెలకొల్పడానికి తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనుక్కు తీసుకోవాలని, కాకినాడ ఎస్ఈజెడ్‌లో అత్యంత ప్రమాదకరమైన, కాలుష్య కారకమైన ఈ బల్క్ డ్రగ్స్ యూనిట్లు నెలకొల్పాలన్నా అక్కడ మత్స్యకారులు, ప్రజలు వ్యతిరేకిస్తే ఆ ప్రమాదకరమైన బల్క్ డ్రగ్స్ యూనిట్లు నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని చూడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మహేష్‌బాబు, కె.భూ లోక, ఎం.నారాయణరావు, సిహెచ్ సోమేష్, వి.శ్రీనువాస్, పి.దావీద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులు వృథా.. సమస్య యధాతథం కథనానికి "స్పందన"

విశాలాంధ్ర - చింతపల్లి: నిధులు వృథా... సమస్య యధాతథం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక జెడ్పిటిసి పోతురాజు బాలయ్య చొరవతో ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో ప్రారంభమై అనివార్య కారణాల వలన అసంపూర్తిగా నిలిచిన మురుగు కాలువల పరమత్తు పనులు ఎట్టకేలకు విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన నిధులు వృథా సమస్య యధాతథం కథనంతో గురువారం పునః ప్రారంభమయ్యాయి. దీనికి తోడు గురువారం కురిసిన కుంభవృష్టి వర్షంతో మందంగా పూర్తి చేసిన ఒకవైపు ముఖ్య కాలువలో చేరిన చెత్తాచెదారం ఎత్తైన ప్రాంతం నుంచి జోరుగా పారుతున్న వర్షపు నీటితో కొట్టుకుపోవడంతో కాలువలు కొంతమేర శుభ్రపడడంతో ఇక దోమల తాకిడి తగ్గుతుందని వ్యాపారస్తులు, ప్రజలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

యూసీడీ పీడీపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీలో డిప్యుటేషన్‌పై వచ్చిన యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపు నాయుడిపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నుండి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు గురువారం జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ వినతి పత్రం ద్వారా తెలియజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవీఎంసీలో అవినీతి తిమింగలంగా మారి, అసభ్య పదజాలంతో క్రింద స్థాయి అధికారులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపు నాయుడుపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎక్సైజ్ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన అవినీతి అక్రమాలపై నెలన్నర క్రితం ఫిర్యాదు చేసినా మేయర్, కమిషనర్ ఎటువంటి చర్యలు గాని, విచారణలు గాని ఆదేశించలేదన్నారు. యు సి డి అధికారుల నుంచి బలవంతంగా రెండు కోట్ల రూపాయలకు పైగా వసూలు చేశారన్నారు. యు సి డి విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సి ఒ) ఉద్యోగాలు వేయిస్తానంటూ రిసోర్స్ పర్సన్స్ నుంచి 5 లక్షల రూపాయల చొప్పున వసూలు మొత్తంగా కోటి రూపాయలకు పైగా చేతుల్లోకున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటన్నింటిపై ఏసీబీతో దర్యాప్తు జరిపించడానికి సిఫార్సు చేయాల్సిందిగా వినతి పత్రంలో కోరినట్టు తెలిపారు.

లక్ష్యానికి అనుకూలంగా ఉపాధి హామీ పనులు చేయించాలి

విశాలాంధ్ర బ్యూరో - రంపచోడవరం: ఏజెన్సీలోని ఉపాధి పనులు టార్గెట్ ప్రకారం పనులు చేయించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రంపచోడవరం, చింతూరు డివిజన్ పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ఇతర సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మండలాలలోని ప్రతి గ్రామంలో మంజూరైన పనులను టార్గెట్ ప్రకారం పనులు చేయించాలని ప్రాజెక్టు అధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఏపీవోలు ఎప్పటికప్పుడు సంబంధిత మండలాలలో ఉపాధి పనులను పర్యవేక్షించాలని ఆయన అన్నారు. గంగవరం మండలంలోని ముఖన భూములకు సంబంధించిన వివరాలు సమర్పించాలని సంబంధిత ఏపీఓను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. చింతూరు డివిజన్లోని నాలుగు మండలాలలో ఉపాధి హామీ పథకం పనులు చేయించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందికి ఈ నెల జీతం ఆపాలని అన్ని మండలాలకు సంబంధించిన ఏపీఓ లను ప్రాజెక్టర్ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీలు రాంబాబు, భాగ్య రావు, ఉపేంద్ర, ఏపీవోలు సాయిబాబా, ప్రకాష్, సురేష్, రెడ్డి బాబు, ఎన్ఆర్ఇజిఎస్ టి.మర్యమ్మ, జి ఆనంద్, ఏసీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని మాకవరపాలెం కస్తూర్బా పాఠశాల ఎస్ఓ త్రివేణి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నారాయణమూర్తి కోరారు. గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా

విశాలాంధ్ర - రావికమతం: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అందుతున్న వైద్యసేవలను సమీక్షించేందుకు డాక్టర్ ఎల్ల రమణ, శ్రీవిజన్ బృందం కొత్తకోట పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ద్వారా జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో అందిస్తున్న వైద్యసేవలు గురించి ఆరా తీశారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల అమలు, ప్రజలకు ఏ మేరకు వైద్యసేవలు అందుతున్నాయో వైద్యాధికారి రజనిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రామారావు, హెచ్‌వి విజయ, ఫార్మసిస్ట్ పద్మ, పర్యవ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: స్థానిక 75వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి పరిశీలించారు. కాంట్రాక్టర్లకు నాణ్యత విషయంలో రాజీ పడకుండా బాగా నిర్మాణం చేయాలని సూచించారు. ప్రజలెవరూ చెత్తా చెదారాన్ని డ్రైనేజీలలో వదలవద్దని, ప్రతి రోజు మీ మీ ఇళ్ల వద్దకు వస్తున్న జీవీఎంసీ వాహనాలకు అందించి డ్రైనేజీలలో నీటి పారుదల సజావుగా సాగేలా సహకరించాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని సంతపాకల వద్ద నున్న షాలోమ్ ప్రేయర్ హౌస్‌లో జీవన్ పరివర్తన ట్రస్ట్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చారు. ట్రస్ట్ డైరెక్టర్ సంజయ్ దలవాయి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేసి సమాజంలో ప్రతి స్త్రీ అభివృద్ధి చెందాలని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ధ్యేయంతో బి.డేవిడ్, ట్రస్ట్ సౌత్ ఇండియా సూపర్ వైజర్ ప్రవీణ్ కాంత్, పాస్టర్ జి.సాల్మన్ రాజ్ అన్నారు. ఈ మేరకు 150 మందికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అకౌంటెంట్ జోసెఫ్, టీమ్ మెంబర్స్ సుశీల రూతు, ప్రస్ బి.శాంతి, టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

ఉమ్మడివరం గ్రామాన్ని పోలవరం ముంపులో చేర్చాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని ఉమ్మడి వరం గ్రామాన్ని పోలవరం ముంపు గ్రామాల జాబితాలో వెంటనే చేర్చాలని సీపీఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ గ్రామ శాఖ కార్యదర్శి పొడియం శ్రీరామ మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెమ్ సత్యనారాయణ మాట్లాడుతూ గత శబరి గోదావరి వరదల కారణంగా గ్రామం పూర్తిగా మునిగిందని అటువంటి గ్రామాన్ని వరదల బాధితుల ప్రభుత్వం గాని, అధికారులు గానీ గుర్తించక పోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ బెయిల్ మంజూరు చేయాలని అరకు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు తామర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని గల అండిబ పంచాయతీ పరిధి గెడ్డలో అర్ధ నగ్నంగా కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షాలపై రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేయాలని, ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే జగన్ రెడ్డి ప్రధాన ఉద్దేశమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శివ, రాము, విశ్వనాథం, రవి, సింహాద్రి, రవికుమార్, బాలేష్, సాయి, సింహాద్రి, గాదిల్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికలలో వచ్చిన కథనాలపై స్పందించండి

విశాలాంధ్ర - చింతపల్లి :- పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన సమస్యలపై పాలకులు, అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని బహుజన్ సమాజ్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రికలో సోమవారం ప్రచురితమైన పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న బోతున్న పెద్ద పైపు అనే కథనానికి పాలకులు, అధికారుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న పాత్రికేయ వ్యవస్థ ద్వారా అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నప్పటికీ పాలకులు గాని, సంబంధిత శాఖ అధికారులు వాటిపై స్పందించకపోవడంతో సమస్యలు మరుగున పడిపోతున్నాయన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సాక్షాత్తు జిల్లా కలెక్టర్ చెబుతున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు గ్రామాలలో నెలకొన్న సమస్యలను గుర్తించకపోగా, పత్రికలలో వచ్చిన కథనాలపై కూడా స్పందించకపోవడం పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తరతరాలుగా చింతపల్లి ప్రజలకు దాహార్తిని తీర్చే పెద్ద పైపు నేడు పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా ఉందన్నారు. గ్రామంలో గతంలో పంచాయతీ కుళాయిల ద్వారా నీరు అందించే విధానం ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ తదితర కొత్త కొత్త పథకాలతో ఇంటింటికి కులాయిలు అనే నినాదాన్ని తీసుకువచ్చి పంచాయతీ కులాయిలను లేకుండా చేశారని, జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించే కార్యక్రమాన్ని చింతపల్లిలో నేటి వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సాక్ష్యమన్నారు. ప్రతి ఇంటికి త్రాగునీరు అందించే పెద్ద పైపు ను పాలకులు అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లనే మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య తాండవిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు పత్రికలలో వచ్చే కథనాలపై స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

జెడ్పీటీసీ నూకరాజును పరామర్శించిన మండల వైసీపీ నేతలు

విశాలాంధ్ర - కొయ్యూరు: నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న జడ్పిటిసి వారా నూకరాజును కొయ్యూరు మండల ప్రజా ప్రతినిధులు వైసీపీ నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు. బుధవారం చటర్జిపురం గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో ఉన్న జడ్పిటిసి నూకరాజు పై పలువురు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న విషయం తెలిసిందే. కాగా గురువారం చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జైతి రాజులమ్మ, డైరెక్టర్ అచ్యుత్ కొయ్యూరు వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముసలి నాయుడు వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రీమల గంగాధర్, మహేష్ సర్పంచులు శ్రీను రాజు రాజకుమారి తదితర పలువురు ప్రజా ప్రతినిధులు నేతలు నూకరాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. తామంతా అండగా ఉంటామని భరోసా కల్పించడంతో పాటు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నూకరాజు త్వరగా కోలుకోవాలని వారంతా ఆకాంక్షించారు.

ముఖ్యమంత్రిని కలిసిన మెంటి మహేష్

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెంటి మహేష్, గురువారం ఉదయం అమరావతిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసారు. ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ లతో కలిసి అసెంబ్లీకి వెళ్లిన మహేష్, అక్కడ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి ఆయన ఆశీర్వాదం అందుకున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

విశాలాంధ్ర - యస్.రాయవరం : నర్సీపట్నం రోడ్ రైల్వే స్టేషన్ రేగుపాలెం రైల్వే స్టేషన్ కు మధ్యలో రైలు పట్టాలపై గుర్తుతెలియని లభ్యమయింది. తుని గవర్నమెంట్ రైల్వే ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాలు ప్రకారంగా ఈ రైల్వేస్టేషన్ల మధ్యలో ఒక గుర్తు తెలియని మృతదేహం ఉందని సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లడం జరిగిందన్నారు. తుని నుండి అనకాపల్లి వైపు వెళ్లే పట్టాలపై తెలుపు రంగు ఫుల్ చేతులు చొక్కా సిమెంట్ రంగు జీన్ ప్యాంటు ధరించిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని ఆ మృతదేహాన్ని తుని ఏరియా హాస్పిటల్ మార్చురీకు తరలించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి సమాచారం ఉన్న తుని రైల్వే పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలని ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుకు గిరిజన రైతు అస్వస్థత

విశాలాంధ్ర - అనంతగిరి: గుమ్మ పంచాయతీ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం పిడుగు పడడంతో పశువుల మేతకు అడవిలోకి తీసుకెళ్లిన దూరు గంగన్న దొర అనే గిరిజనుడు తీవ్ర అస్వస్థతకు గురికాగా ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. పిడుగుపాటుకు సంఘటన స్థలంలో ఒక ఒక ఆవు, రెండు దుక్కుటెద్దులు మృతిచెందగా పశువుల కాపరి వైఎస్ఆర్సిపి కార్యకర్త పంచాయితీ బోర్డు మెంబర్ దూరు గంగన్న దొర గాయాలు పాలయ్యారు. తెలుసుకున్న వైయస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి అక్కడకు చేరుకొని అక్కడ డాక్టర్ తో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ ఏర్పాటు చేసి కేజిహెచ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొర్ర సూర్యనారాయణ, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది లోగా సిద్ధి ఫల రైతు ఉత్పత్తిదారుల గోడౌన్ ఏర్పాటు

విశాలాంధ్ర - చోడవరం: వచ్చే ఏడాది లోగా సిద్ధి ఫల రైతు ఉత్పత్తిదారుల కార్యకలాపాల నిర్వహణకు గోడౌన్ ఏర్పాటు చేస్తామని సంఘం అధ్యక్షుడు తాళపురెడ్డి వెంకట సత్య వీరు నాయుడు అన్నారు. సంఘం నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా గురువారం లక్ష్మీపురం తులసి కళ్యాణ మండపములో సమావేశం అయ్యారు. సంఘంలో సుమారు 10 గ్రామాల నుండి 583 మంది రైతాంగం ఈ సంఘంలో సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. ఉద్యాన వన శాఖ ద్వారా కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి రూ. 11.25 లక్షలు గ్రాంట్ విడుదల అయినట్లు తెలియజేశారు. గతేడాది వార్షికోత్సవ నివేదికను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ ఎం.డి. కె.సుజాత, సర్పంచ్ సిరిసోళ్ళ ఆది గణపతి నాయుడు, వి.ఏ.ఏ. కె. ఫణీంద్ర, వ్యాకరణం సుబ్రహ్మణ్యం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర - మధురవాడ: శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు మారికవలస సబ్ స్టేషన్ నందు గల 11కే.వీ. జే.యన్.యన్.యు.ఎన్నార్.యం. ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తము విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని జోన్3 ఆపరేషన్ ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాస్ రావు కార్యాలయం గురువారం తెలిపింది. ఈ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం మారికవలస జేయన్.యన్. యు.ఆర్.యం,పి.పి.2.కోలనీ, హౌసింగ్ కాలనీ,మారికవలస పెట్రోల్ బంక్ ఏరియా,శారదా నగర్ కాలనీ,తిమ్మాపురం రోడ్, ఓం కార్. అపార్టుమెంట్, వై.ఎస్.ర్ కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు. కావున వినియోగ దారులు సహకరించాలని వలసిందిగా తమ ప్రకటనలో కోరారు.

చోడవరంలో మిల్లెట్ ఫుడ్ కోర్ట్

విశాలాంధ్ర - చోడవరం: ఆదివాసీ రైతుల సహజ ఉత్పత్తుల కంపెనీ ఆధ్వర్యంలో సీఈఓ ముక్కా రమేష్ నేతృత్వంలో చోడవరం - నర్సీపట్నం బి.ఎన్. రహదారిలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఫుడ్ కోర్ట్ ను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. రైతాంగాన్ని ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి మళ్ళించడం, ప్రజారోగ్యానికి చిరుధాన్యాలు ప్రాముఖ్యతను వివరించారు. చక్కని ఆరోగ్యానికి తృణ ధాన్యాలు, సహజ సిద్ధమైన ఆహారం తీసుకోవాలని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నన్నయ్య విశ్వ విద్యాలయం విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు, సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస రావు, ముక్కా మహాలక్ష్మి నాయుడు, గ్రామ సర్పంచ్, స్వచ్ఛంద సంస్థ ల సీఈఓ బద్ది రాము, బషీర్, ఆదివాసీ ఎఫ్.పి.ఒ. సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ గ్రామ సమీపంలోని రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, స్వల్ప గాయాలతో బయటపడ్డారు.. విశాఖపట్నం మద్దిలపాలెంకు చెందిన టోని అతని స్నేహితుడు అరకు అందాలను తిలకించేందుకు వచ్చి, తిరుగుప్రయాణంలో చిలకలగెడ్డ వద్ద ఎదురుగా మరో బైక్‌ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కాశీ పట్టణం పంచాయితీ దిగువభూడికి చెందిన జి.పండయ్య గాయపడగా టోనీకి కుడికాలు విరిగిపోయాయి. వెనుక కూర్చొన్న ఇద్దరు స్వల్పగాయలతో బయటపడ్డారు. క్షతగాత్రుల వైద్య సేవ నిమిత్తము ఎవరికి వారు ఆసపత్రులకు తరలి వెళ్లారు.

జీ తెలుగులో అన్నీ మంచి శకునములే, 'పడమటి సంధ్యారాగం-గణేష్ సంబరం' ఆదివారం ప్రసారం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదం అందించే జీ తెలుగు ఈ ఆదివారం మరింత వినోదం అందించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ డ్రామా అన్నీ మంచి శకునములే సినిమాని వరల్డ్ ప్రీమియర్ గా ఈ ఆదివారం అందిస్తోంది జీ తెలుగు. అలాగే, మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన పండగలు, ఉత్సవాలను మరింత వినోదంగా మార్చేందుకు ప్రయత్నించే జీ తెలుగు ఈ గణపతి నవరాత్రులు సందర్భంగా వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ అన్నీ మంచి శకునములే ఆదివారం (సెప్టెంబర్ 24న) మధ్యాహ్నం 1 గంటలకు ప్రసారం చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. అదేవిధంగా అనిల్ రావిపూడి, ఎస్ఎస్ థమన్ ముఖ్య అతిథులుగా సరదా ఆటలు, పాటలతో సాగే 'పడమటి సంధ్యారాగం-గణేష్ సంబరం', సాయంత్రం 6 గంటలకు, జీ తెలుగులో ప్రసారం కానందుని తెలిపారు.

వ్యవహారిక భాషను భావితరాలకు అందించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రపంచంలో ఎన్నో భాషలు ఉన్నాయని, వాటిలో తెలుగు భాషే అందమైన భాష అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం మరియు తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో గల వివిధ ప్రభుత్వ శాఖలలో తెలుగు భాషా అమలు తీరుపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో భాషా వేత్తలు, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసినవారందరికి సత్కరించుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషను సాంప్రదాయ భాషగా, లౌకిక భాషగా పాలన అవసరాల మేరకు మనుగడకోసం వ్యవహారిక భాషను భావితరాలకు అందించవలసిన అవసరం మన అందరిపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే సమావేశాలలో తెలుగులోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ బ్రోచర్లు, కరపత్రాలు తెలుగులోనే ముద్రించడం జరుగుతుందని, బస్ స్టాప్‌లో సమాచారం తెలుగులోనే ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జగనన్నకు చెబుదాం వంటి ప్రజా స్పందన కార్యక్రమాలను తెలుగు భాషలో నిర్వహించడం జరుగుతోందన్నారు. జి.వి.ఎం.సి. పరిధిలో బోర్డులను మిగిలిన సమాచారం కూడా త్వరలో తెలుగులో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్.డి.ఓలు హుసేన్ సాహేబ్, భాస్కర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా కె.రత్న మాణిక్యం తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు సాహితీ వేత్తగా మిగిలిపోలేదని, గొప్ప సంఘ సంస్కర్తగా నిలిచారని, గురజాడ తెలుగు భాష ఉన్నంత వరకు జీవించి ఉంటారని అన్నారు తెలుగు విభాగాదిపతి కె.శ్రీదేవి మాట్లాడుతూ అనేక కష్టాలు పడి విద్యను ఎలా అభ్యసించారో, తన రచనల ద్వారా సామాజిక పరివర్తనకు ప్రయత్నించిన "మహాకవి" అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్, అధ్యాపకులు జి. వెంకట్రావు, కె.శకుంతల, జి.హారతి, ఎస్.అప్పనమ్మ, కె.శైలజ, సిహెచ్.రాజబాబు, కె.శ్రీలక్ష్మి, ఆర్.మౌనిక, వి.గౌతమి, జి.సాయికుమార్, పి.ఏడుకొండలు, వి.అలివేలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: మాకవరపాలెం మండలం జంగాలపల్లి పంచాయతీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం గురజాడ అప్పారావు 161 వ జయంతి వేడుకలు పురస్కరించుకొని మండల విద్యాశాఖ అధికారి పిఎస్ఎన్.మూర్తి గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుజాడ ఆనాటి సమాజంలో ఉన్న దురాచారాలను ఎండగడుతూ కన్యాశుల్కం దిద్దుబాటు పుత్తడిబమ్మ పూర్ణమ్మ అనే విప్లవాత్మకమైన రచనలు ద్వారా సమాజం లో పరివర్తన తీసుకొచ్చిన మహనీయులు గురజాడ అప్పారావు అని కొనియాడారు. ఉత్తరాంధ్ర వాసిగా ఆ రోజుల్లో సామాజిక బాధ్యతతో సమాజ హితంగా ఆనాటి సమాజంలో వరకట్నం, బాల్య వివాహాలకు వ్యతిరేకం సామాజిక అసమానతల పై గురజాడ చేసిన కళషి మరువలే మన్నారు. గురజాడ వాడుక భాషలో సమాజ హితమైన ఎన్నో రచనలు,ఆయన సేవలు నేటికీ మనకు ఆదర్శం అని పేర్కొన్నారు. ఆయన అద్భుత రచనల్లో కన్యాశుల్కం అత్యంత ఆదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమం లో సిఆర్‌పి గణేష్, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్.రామచంద్రమూర్తి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యులు అనంత నాయక్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు అనంతనాయక్ ఈనెల 22, 23 తేదీలలో అల్లూరి సీతారామ జిల్లా పాడేరు డివిజన్ పరిధిలో పలుచోట్ల పర్యటించున్ననట్టు, శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానికి పిఎంఆర్‌సి భవనంలో స్థానిక గిరిజన నేతలతో సమావేశమవుతారని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. 12.20 గంటలకు బయలుదేరి శ్రీకృష్ణాపురం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారని అక్కడ ఏర్పాటు చేసిన జిసిసి, కాఫీ, విడివికె స్టాల్స్‌ను సందర్శిస్తారన్నారు. గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తారనీ, సమావేశం ముగించిన అనంతరం 2.30 గంటలకు బయలుదేరి మెడికల్ కళాశాల నిర్మాణపు పనులు పరిశీలిస్తారని ఆతరువాత కుమ్మరిపుట్టులో ఉన్న గురుకుల పాఠశాల, ఏకలవ్య పాఠశాలలను సందర్శిస్తారన్నారు. మ.3.45 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 23వ తేదీన ఉదయం 9 గంటలకు గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల లేదా ఉప్ప గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారని, అక్కడ నుండి బయలు దేరి దుంబ్రిగుడ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూలు పాఠశాల భవన నిర్మాణాలను పరిశీలి స్తార న్నారు. మధ్యాహ్నం కిల్లోగుడ ఆశ్రమ పాఠశాల సందర్శించిన అనంతరం పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియంను సందర్శించిన అనంతరం తిరుగు ప్రయాణం అవుతారని చెప్పారు.

గురజాడ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మహాకవి గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమాన్ని గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో ప్రభుత్వము అధికారికంగా నిర్వహించాలని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ (రాజమహేంద్రవరం) మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు అన్నారు. గురువారం గురజాడ అప్పారావు జన్మస్థలం యస్. రాయవరం గ్రామంలో గురజాడ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ చేసిన రచనలు దేశ విదేశాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గురజాడ రచించిన రచనలను వివిధ భాషల్లో ముద్రించి సమాజానికి తెలిసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బైపాస్ శ్రీనివాసరావు, వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు కర్రి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కందుల వెంకటేశ్వరరావు, స్థానిక పిఎసిఎస్ అధ్యక్షులు అల్లాడ నాగరాజు, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, స్కూల్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్రావెల్ లారీలు సీజ్

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో ఆరు గ్రావెల్ లారీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. బుధవారం రాత్రి 8:30 సమయంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద టెన్ టైర్లు టిప్పర్లు లారీలు ఆగి ఉండడంతో అదే సమయంలో తహసిల్దార్ కార్యాలయంలో విధుల్లో ఉన్న అధికారులు బయటికి వచ్చే సమయంలో ఆరా తీశారు. దీంతో తహశీల్దార్ విజయకుమార్ లారీలు పరిశీలించి డ్రైవర్లను రికార్డులు అడిగారు. గ్రావెల్ కసింకోట మండలం నుంచి వచ్చిందని అనడంతో బిల్లులు చూపించాలని తహశీల్దార్ ఆదేశించారు. గ్రావెల్ సరఫరా చేసే మైన్స్ బిల్లులు సక్రమంగా లేకపోవడంతో లారీలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిబంధన ప్రకారంగా గ్రావెల్ రవాణా చేసే సమయంలో బిల్లులు లేకపోవడం ఏమిటని లారీ డ్రైవర్‌ను ప్రశ్నించారు. తహశీల్దార్ విజయకుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిబంధన ప్రకారంగా బిల్లులు లేకపోవడంపై తదుపరి చర్యలు నిమిత్తం మైన్స్ అధికారులకు నివేదిక పంపిస్తున్నామని వాటిపై చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర - చింతూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం (ఎన్ఎస్-ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో గురువారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేసారు. ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టం, 17వ వార్డుకి చెందిన పారువల్లి అప్పలస్వామి నాయుడు రాములు అనే వ్యక్తి లివర్(కాలేయ) సంబంధిత సిర్రోసిస్ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం ఆ కుటుంబ సభ్యులు నర్సీపట్నం శాసనసభ్యులు ఉమా శంకర గణేష్‌ను సంప్రదించగా, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సహాయ నిధి నుండి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ నిమిత్తము సుమారు 10 లక్షల రూపాయలను ఆయన లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ ఖర్చుల నిమిత్తం అడ్వాన్స్‌గా శాంక్షన్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడిబండి నాగేశ్వరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - పాయకరావుపేట: జనసేన నాయకులు గెడ్డం బుజ్జి సమక్షంలో నక్కపల్లి మండలం, డీఎల్‌పురం గ్రామానికి చెందిన ప్రజాసేవ సంఘం మత్స్యకార యువకులు 20మంది జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జనసేన నాయకులు గెడ్డం బుజ్జి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జగ్గన్నదొర, పల్లి దుర్గారావు, నల్లల రత్నాజీ, చరణ్, శివ, సతీష్, నాని, బంగారి, పవన్ కుమార్, రాంబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పెందుర్తి: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ సిహెచ్.పూర్ణేంద్ర బాబు సూచించారు. జగనన్న సురక్ష ప్రోగ్రాంలో భాగంగా గోపాలపట్నం టిబి యూనిట్ సిబ్బంది, పెందుర్తి పిహెచ్‌సి పరిధిలోని పెదగాడి, పినగాడి, కరకవానిపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్ళి వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా వున్న వారు వెంటనే కళ్ళే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ వానపల్లి శ్రీనివాసరావు, టిబి హెల్త్ విజిటర్ కే.శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ ఇస్సాక్, ఈశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు క్షేత్ర సందర్శన

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అభ్యుదల పాడి రైతులకు స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల నందు ఉన్న చిట్టూరి ఆగ్రో, లాక్టేటింగ్ ఫుడ్స్ డైరీని క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 44మంది రైతులకు డైరీ ఫారంలో ఉన్న తక్కువ ఖర్చుతో తయారు చేస్తున్న మేత, పేడతో సేంద్రీయ ఎరువుల తయారీ, గోబర్ గ్యాస్ తయారీ, పలు రకాల పశు గ్రాసం సాగు, అధిక దిగుబడి ఇచ్చే వివిద గో జాతులు వీక్షించారు. రైతుల సందేహాలకు విద్యాసంస్థల అధినేత, చిట్టూరి ఆగ్రో, లాక్టేటింగ్ ఫుడ్స్ మేనేజింగ్ డైరక్టర్ సీహెచ్‌వికె నరసింహారావు నివృతి చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డి.రామకృష్ణ, అదనపు సంచాలకులు వై.సింహాచలం, సహాయ సంచాలకులు పి.రాజగోపాల్, పాడి రైతులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో సహస్ర దీపాలంకరణ

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో గణపతి నవరాత్రుల పురస్కరించుకొని గురువారం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దీపారాధన చేసారు. అలాగే బెల్లం గణపతికి ప్రత్యేక పూజలు చేసి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు శరగడం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలో ఉన్న తాగునీరు, సిసి రోడ్లు పెండింగ్‌లో ఉన్న వర్కులపై సమీక్ష నిర్వహించినట్లు ఎంపీడీఓ చంద్రశేఖరరావు తెలిపారు. మండలంలో ఉన్నటువంటి అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, సెక్రటరీలను పెండింగ్‌లో ఉన్న వర్కులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్, జేఈ విజయ్ కుమార్, పీఆర్ జేఈ మాణిక్యం, సత్యనారాయణ పాల్గొన్నారు.